వైద్య కళాశాలల పరిరక్షణకు ప్రజా ఉద్యమం

- కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి, తాడికొండ సమన్వయకర్తలు డీవీఆర్, బాలవజ్రబాబు

మంగళగిరి టౌన్: వైద్య కళాశాలల పరిరక్షణకు ప్రజా ఉద్యమం చేపట్టినట్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను నాయకులతో కలసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ప్రజా ఉద్యమం ప్రారంభం కాబోతోందని, 45 రోజులకు పైగా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అక్టోబర్ 28న నియోజకవర్గ కేంద్రాల్లో , నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు జరుగుతాయన్నారు. నవంబర్ 23న నియోజకవర్గాల నుంచి, జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు, నవంబర్ 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిస్తారని చెప్పారు. గవర్నర్‌కు కోటి సంతకాల పత్రాల నివేదికను అందించే కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టనున్నట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారన్నారు.

చంద్రబాబు కుట్రలకు అడ్డుకట్ట

మెడికల్ కాలేజీలపై చంద్రబాబు కుట్రలకు అడ్డుకట్ట వేసేందుకు వైఎస్సార్ సీపీ బాధ్యత తీసుకుందన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాళి వెంకట కృష్ణ, తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, దుగ్గిరాల మండల ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా యాక్టివిటీ కార్యదర్శి సుధారాణి, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు పాలశ్రీనివాస్, జిల్లా ఎస్టీ విభాగ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, మహిళా విభాగ అధ్యక్షులు ఫిలోమినా, నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షులు భూషణం, నియోజకవర్గ బీసీ విభాగ అధ్యక్షులు సుబ్బారావు, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు రుక్మాంగరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ సంయుక్త కార్యదర్శులు ఫిరోజ్, ఆదాం, నియోజకవర్గ బూత్ విభాగ అధ్యక్షులు, మున్సిపల్ విభాగ అధ్యక్షులు, సోషల్ మీడియా విభాగ అధ్యక్షులు దర్శి రమేష్, సుబ్బారావు, శరణ్‌కుమార్ రెడ్డి, మంగళగిరి పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకె సునీత, పట్టణ బీసీ విభాగ అధ్యక్షులు కుంచాల కృష్ణ కిషోర్, నేతలు మల్లికార్జునరెడ్డి, సుభాని తదితరులు పాల్గొన్నారు.

పేదవాడికి వైద్యం అందకుండా కుట్ర

తాడికొండ: పేదవాడికి వైద్యం అందకుండా కూటమి సర్కారు కుట్రలు చేస్తోందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్ర బాబు (డైమండ్) అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తూ చేస్తున్న కూటమి సర్కారు విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టనున్న నేపథ్యంలో గుంటూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. డైమండ్ బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టి రూ.3 వేల కోట్లు ఖర్చు చేసి 7 మెడికల్ కళాశాలలు పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మైనేని నాగమల్లేశ్వరరావు, తాళ్ళూరి వంశీ, మార్పుల శివరామిరెడ్డి, ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, వివిధ విభాగాల అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, బొంతా శ్రీకాంత్, షేక్ అబ్బాస్, బాకి వెంకటస్వామి, షేక్ అజీస్, దమ్మాటి మోహనరావు, గుంటి రఘువరన్, మల్లంపాటి చంద్రశేఖర్ రెడ్డి, బెజ్జం రాంబాబు, ఆరేపల్లి జోజి, కొప్పుల శేషగిరిరావు, కంతేటి అశోక్, దానం వినోద్, కొయ్యగూర వినోద్, సుంకర శ్రీనివాసరావు, షేక్ జానీ, తమ్మనంపల్లి శాంతయ్య, చేవూరి రామ్మోహనరెడ్డి, హేమలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని రోడ్లండి.. ఇంతేనండి!

తాడికొండ: అసెంబ్లీ వేదికగా రాజధానికి వెళ్ళే ప్రధాన రహదారి దుస్థితిపై ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడినా చారెడు మట్టిని వేయని దుస్థితి రాజధానిలో నెలకొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తన నియోజకవర్గంలో రాజధానికి వెళ్ళే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి కనీస వినియోగానికి కూడా పనికిరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలు పూర్తై 10 రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు గుంతలను పూడ్చే సాహసం కూడా చేసిన దాఖలాలు కానరాలేదు. గుంతలు కాస్తా చిన్నపాటి చెరువుల్లా మారి రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారింది. పెదపరిమి నుంచి తుళ్ళూరు వరకు గజానికో గుంత, అడుగుకో రాళ్ల కుప్పలు దర్శనమిస్తుండటంతో వీఐపీలు, వీవీఐపీలు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం నుంచే ఏపీ సచివాలయ ఉద్యోగులు, హైకోర్టు జడ్జిలు, ఇతర వీవీఐపీలు నిత్యం ఇటుగా ప్రయాణం సాగిస్తున్నారు. వీరందరికీ ప్రయాణం నరకప్రాయంగా మారిన నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



తుళ్ళూరు సమీపంలో గుంటూరు వెళ్ళే ప్రధాన రహదారి ఇలా.



పెదపరిమి వద్ద గుంతలమయం



శాఖమూరు సమీపంలో అధ్వానంగా రోడ్డు

క్లుప్తంగా

మానసిక వికాసంతో ఆరోగ్యం



ఫిరంగిపురం: మానసిక వికాసంతో ఆరోగ్యంగా ఉంటారని కమ్యూనిటీ హెల్త్ అసిస్టెంట్ పి.లింగరాజు అన్నారు. మండలంలోని మునగపాడు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ అందరూ ఆహార జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. విద్యార్థులకు ఆటలు మానసిక సంతోషాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందయ్య, హెచ్ఎం వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సెక్రటరీగా దామర్ల



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల నూతన సెక్రటరీ, కరస్పాండెంట్‌గా దామర్ల వెంకట నరసింహారావును ఎంపిక చేసినట్లు శుక్రవారం కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఇ. చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న జరిగిన కళాశాల కమిటీ గవర్నింగ్ బాడీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

ప్రజలకు జీఎస్టీపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: స్థానిక సెయింట్‌పాల్స్ ఆడిటోరియంలో శుక్రవారం సూపర్ జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జైకుమార్ మాట్లాడుతూ ప్రతి వస్తువుపై ధరలు తగ్గుతాయన్నారు. ప్రతి దుకాణాదారుడు జీఎస్టీ తగ్గింపు ధరల పట్టికను ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల: జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి గుంటూరు జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దుగ్గిరాల మండల పరిషత్ ఆవరణంలో వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు వాటి తగ్గుదల వివరాలతో ఎగ్జిబిషన్ జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డెప్యూటీ ఎంపీడీఓ నెహ్రూ, సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుగ్గిరాల: స్థానిక 11 కె.వి చిలువూరు ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం పలు గ్రామాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కె.గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు కంఠంరాజుకొండూరు, చిలువూరు, మంచికలపూడిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నేడు పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్ : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోస్టర్ ఆవిష్కరణను చేస్తున్నట్లు తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి భవన్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తారని, నాయకులు, మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యాన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆషాబాల తదితర నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టానికి కృషి



మురుగుడు, డీవీఆర్‌లను సత్కరిస్తున్న నూతక్కి

మంగళగిరి టౌన్: వైఎస్సార్ సీపీలో నియమితులైన వారు పార్టీ పటిష్టతకు, బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. బైపాస్ వెంట ఉన్న నియోజకవర్గ కార్యాలయంలో ఇటీవల నూతనంగా నియమితులైన రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి నూతక్కి జోష్ మర్యాద పూర్వకంగా శుక్రవారం ఎమ్మెల్సీ హనుమంతరావును, సమన్వయకర్త డీవీఆర్‌ను కలసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తేవడానికి కష్టపడి పని చేయాలని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతక్కి జోష్ మాట్లాడుతూ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో మంగళగిరి మండల అధ్యక్షులు నాళి వెంకట కృష్ణ, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ సంయుక్త కార్యదర్శి ఈపూరి ఆదాం తదితర నాయకులు పాల్గొన్నారు.

ఐదు నెలలుగా వేతనాల్లేక వెతలు



సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, సిబ్బంది

ఫిరంగిపురం: పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నారని వారికి జీతాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలని కోరుతూ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనేకసార్లు దీనిపై అధికారులకు తెలియజేసినా వచ్చినప్పుడు ఇస్తామంటూ చెబుతున్నారన్నారు. ధరలు పెరుగుతుండటంతో వారి జీతాలు రూ.15 వేలకు పెంచాలని, వాటితో పాటు ప్రైవేట్ ఫండ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు, సెంట్ టీజర్లు సబ్బులు, నూనె బ్లౌజులు కూడా వారికి అందజేయాలని చెప్పారు. ఈనెల 24 లోపు జీతాలు చెల్లించకుంటే సమ్మె దిశగా అడుగువేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నూతన పని గంటల విధానాన్ని ఉపసంహరించుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

తాడేపల్లి రూరల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పనిగంటల విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లిలో శుక్రవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని తుంగలో తొక్కి చంద్రబాబు ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు 18 మాసాల నుంచి కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సంబంధిత అధికారులు వెంటనే వీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు సంతోషం, నాని, మేరి, శ్రీను, కంచర్ల అనూష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



గెలుపొందిన వడ్డేశ్వరం జెడ్పీ స్కూల్ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని గుడ్‌షెపర్డ్ కాన్వెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ కో ఆర్డినేటర్ విద్య మాట్లాడుతూ 2012 అక్టోబర్ 11న ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించిందని పేర్కొన్నారు. నాటి నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఆడపిల్లల హక్కులు, సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న లింగ వివక్ష, వేధింపులె, అన్ని రంగాల్లో మగవారితో సమానంగా ఆడవారికి కూడా స్థానం కల్పించాలని చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఐద్వా నాయకులు డి. శ్రీనివాస కుమారి మాట్లాడుతూ బాలికల హక్కుల గురించి బాల్య వివాహాల నిర్మూలన గురించి పోరాడాలన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రాధిక మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి, మనుగడకు ఆడపిల్లలు చాలా అవసరమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.జోజప్ప, ఉపాధ్యాయులు, గుడ్ షెపర్డ్ సిబ్బంది అనూష, పోతురాజు, అనిల్ కుమార్, నాగమణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం 'స్టార్స్'



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న వీఐటీ వీసీ, అధ్యాపకులు

తాడికొండ: గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో వీఐటీ వ్యవస్థాపకుడు జి. విశ్వనాథన్ సంకల్పం మేరకు విశ్వవిద్యాలయంలో స్టార్స్ (సపోర్ట్ అడ్వాన్స్‌డ్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్) ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఎస్.వి. కోటరెడ్డి తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులు (26 జిల్లాల నుంచి ఒక విద్యార్థి, విద్యార్థిని) చొప్పున ఎంపిక చేసి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్యతో పాటు వసతిని, ప్రాథమిక వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 50 మంది విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, డాక్టర్ డి.వెంకట లక్ష్మి (స్టార్స్ కోఆర్డినేటర్), విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఆలయ అభివృద్ధి పనులు

మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరగనున్న వివిధ అభివృద్ధి పనులను త్వరతగతిన ప్రారంభించాలని దేవదాయ ధర్మదాయ శాఖ గొల్లపూడి విజయవాడ కమిషనర్, దేవదాయ శాఖ స్థపతి, ఇంజినీరింగ్ విభాగ అధికారులు ఆదేశించారు. శుక్రవారం స్వామి వారి ఆలయాన్ని వారు సందర్శించారు. ప్లాన్, అంచనాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అత్యవసరంగా ప్రణాళికలు, ఎస్టిమేట్‌లను తయారు చేసి పనులను ప్రారంభించాలని ఆదేశించారు.

ఓడీఎఫ్ నగరంగా మంగళగిరి

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: మంగళగిరిని బహిరంగ మల విసర్జన రహిత(ఓడీఎఫ్) నగరంగా ప్రకటిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలో విస్తృతమైన సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. దాని ఆధారంగా మొత్తం పట్టణాన్ని తాత్కాలికంగా బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా ప్రకటించినట్లు వివరించారు. ఈ తాత్కాలిక స్థితిని శాశ్వతంగా ధ్రువీకరించడానికి, ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్ని కార్యాలయాలకు నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు ప్రజల నుంచి రాలేదని నగరపాలక సంస్థ ప్రస్తుత చట్టాలు, నిబంధనల ప్రకారం ఎంటీఎంసీని అధికారికంగా శాశ్వతంగా బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా ప్రకటించినట్లు తెలిపారు.

ప్రశ్నించేతత్వంతో ముందుకు సాగాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ

తాడేపల్లి రూరల్: సమాజంలో మహిళలు ప్రశ్నించే తత్వంతో ముందుకు సాగాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ ఉండవల్లి గ్రామ ఐద్వా మహాసభను ఓలేటి శాంతి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ఆటో నుంచి అంతరిక్షం వరకు అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇటీవల కాలంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పౌష్టికాహారం అందక పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. అనంతరం ఐద్వా ఉండవల్లి మహాసభ అధ్యక్ష కార్యదర్శులుగా ఓలేటి విజయలక్ష్మి, జ్యోతి, కోశాధికారిగా వల్లభాపురం భవాని, మణి, వి.లక్ష్మి, యు.లక్ష్మి, ప్రియాంకతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

రైతు సమస్యలకు సత్వర పరిష్కారం


నోడల్ అధికారి పి.జయశ్రీ



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీఆర్డీఏ నోడల్ అధికారి జయశ్రీ

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సీఆర్డీఏ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) అధికారి పి.జయశ్రీ అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలువురు రాజధాని ప్రాంత వాసులు, రైతుకూలీలు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. అర్జీదారులు అందజేసిన అర్జీలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని నోడల్ ఈ సందర్భంగా ఆమె అర్జీదారులకు తెలిపారు. మొత్తం 26 అర్జీలు అందాయి. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు బి.శ్రీనివాసనాయక్, జి.రవీందర్, పి.పద్మావతి, ఎం.శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాల కోసం ధర్నా



దుగ్గిరాల: కౌలు రైతు కార్డులేని వారికి పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరు యూనియన్ బ్యాంకు ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు కార్డు లేని వారికి ఈ-క్రాపు నమోదు చేసిన వారికి జె.ఎల్.జె గ్రూపులు ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్ పి.భానుతేజకు సమస్యను తెలియజేయగా బాకీ లేని వారికి రుణాలు ఇస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, ఎం.అంజియ్య, నాగేంద్రం, కాటమరాజు, వీరయ్య, ఇస్మాయిల్‌ఖాన్ పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

మంగళగిరి టౌన్: సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. రూ.2,89,294 విలువైన చెక్కులు ఇచ్చారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మేడికొండూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ బాలస్వామి అన్నారు. పేరేచర్లలోని యూనివర్సల్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజులుగా యువతకు జిల్లా స్థాయి క్రీడల పోటీలైన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ 100 మీటర్లు, షాట్ పుట్ ఈవెంట్లలో జరిగాయి. వీటిని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, రెవరెండ్ ఫాదర్ డాక్టర్ బాలస్వామి, డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బాల, ప్రిన్సిపాల్ డాక్టర్ కోటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని పేర్కొన్నారు. క్రీడల్లో రాణిస్తే శారీరకంగా మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందన్నారు. డైరెక్టర్ బాల మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడానికి క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మై భారత్ కేంద్రను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్ సతీష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారులు, ఫార్మసీ విద్యార్థులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్, ఉన్నత భారత అభియాన్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఇప్పటం గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నరేష్‌బాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, తడిపొడి చెత్త ఏర్పాటు, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలన వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశామన్నారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛత అవసరం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. ఇప్పటంలోని ప్రాథమిక పాఠశాలలో మానవహారంగా ఏర్పడి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇప్పటం గ్రామ సచివాలయ కార్యదర్శి నందం బాలపరమేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మధుబాబు, ఎన్ఎస్ఎస్ స్టూడెంట్ కోఆర్డినేటర్లు బిందు ప్రియాంక, రజియాబేగం, మధుమిత, ప్రజ్ఞ, సాయి స్నిగ్ధ, హలీమా నౌరి తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు రెసిడెన్షియల్, గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే ప్రజలందరు సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ కమిషనర్ అలీమ్‌బాషా కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్ వేస్ట్ (100 కేజీల కంటే ఎక్కువ ఘన పదార్థాలు)ను కంపోస్ట్ చేస్తే ఘన పదార్థాలు తగ్గుతాయని పేర్కొన్నారు. దీంతో నగరం శుభ్రంగా ఉంటుందని వివరించారు. స్పందించిన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నగరపాలక సంస్థను శుభ్రంగా ఉంచడానికి ముందుకు వస్తామని, కంపోస్ట్ ఇన్‌స్టాల్ చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, వివిధ రెసిడెన్షియల్ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు పాల్గొన్నారు.

'దుగ్గిరాల'లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు



మంత్రికి రాసిన బహిరంగ లేఖ చూపుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ

దుగ్గిరాల: మండలంలోని పలుగ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకం జరుగుతోందంటూ సర్వ సభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అరుణ మాట్లాడుతూ మంగళగిరి శాసనసభ్యుడు మండల పరిషత్ సమావేశాలకు ఒక్కసారి కూడా రాలేదని, ఈ కారణంగా ఆయనకు బహిరంగ లేఖలో తెలుపుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కడా అక్రమాలకు తావులేకుండా మద్యం అమ్మకాలు నిర్వహించారన్నారు. కూటమి పాలనలో 5 వైన్ షాపులు అనుమతి పొందిన వ్యక్తులు సుమారు మండలంలోని 18 గ్రామాల్లో 80పైగా అనధికార షాపులు నడుపుతున్నారన్నారు. ఎక్కడ చూసినా నకిలీ మద్యం, అడుగడునా బెల్టు షాపులను కొత్తగా నూతన కంటెయినర్లు పెట్టి వాటికి లైటింగ్‌తో డెకరేషన్ చేసి బహిరంగంగా అమ్ముతున్నారని తెలిపారు. విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేన్నారు. తక్షణం వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజధాని రైతుల వార్షిక కౌలు విడుదల

తాడికొండ: రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు, భూ యజమానులకు ప్రభుత్వం నుంచి చెల్లించవలసిన వార్షిక కౌలు జమ చేశామని సీఆర్డీఏ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాంకేతిక సమస్యలతో కొందరు ఖాతాల్లో వార్షిక కౌలు లబ్ధి కాలేదని పేర్కొన్నారు.